ప్రజాశక్తి
గురువారం 9 జనవరి 2025 5 అనంతపురం

పుడా ఛైర్మన్‌పై 'పల్లె' కన్ను..!

◆ ఇప్పటికే ఆ పదవిపై పలువురు ఆశావహుల ప్రయత్నాలు

◆ టిడిపి అధిష్టానానికి విజ్ఞాపనలు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

మాజీ మంత్రి, టిడిపి సీనియర్ నాయకుడు పల్లె రఘునాథరెడ్డి పుట్టపర్తి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ సంస్థ (పుడా) ఛైర్మన్ పదవి చేపట్టేందుకు పావులు కదుపుతున్నారనే ప్రచారం ఇటీవల జోరుగా సాగుతోంది. ప్రస్తుతం ఆయన కోడలు పల్లె సింధూర రెడ్డి పుట్టపర్తి ఎమ్మెల్యేగా ఉన్నారు. ఈమె రాజకీయాలకు కొత్త కావడంతో పల్లె రఘునాథరెడ్డి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆమెకు సహకారం అందిస్తున్నారు. ఏ కార్యక్రమం జరిగినా ఆయన ముందుండి నడిపిస్తున్నారు. ఇదే సమయంలో ప్రొటోకాల్ సమస్య ఆయనుకు కొత్త సమస్యలను తెచ్చిపెడుతోంది. ఈ నేపథ్యంలో పుడా ఛైర్మన్ పదవి తీసుకుంటే అన్నింటికీ వీలుగా ఉంటుందనే ఆలోచనలో ఆయన ఉన్నట్లు తెలుస్తోంది. పుట్టపర్తి నియోజకవర్గంలోని ఆరు మండలాలను పుడా పరిధిలోకి తీసుకొస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పుడా ఛైర్మన్ పదవిని తీసుకుంటే ప్రొటోకాల్ వర్తిస్తుంది. ఈ కారణంగానే పల్లె రఘునాథ్ రెడ్డి ప్రొటోకాల్ నిమిత్తం పుడా ఛైర్మన్‌పై కన్నేసినట్లు సమాచారం. కుప్పం పర్యటన ముగిసిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నామినేటెడ్ పోస్టులు భర్తీ చేస్తారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. పల్లె రఘునాథ్ రెడ్డి కోడలు ఎమ్మెల్యేగా ఉన్నందున అదే కుటుంబానికి నామినేటెడ్ పదవిని అధిష్టానం ఇస్తుందా.. లేదా అన్న దానిపై సందిగ్ధం నెలకొంది. పుడా ఛైర్మన్ పదవిని పల్లె రఘునాథరెడ్డికి ఇస్తే ప్రొటోకాల్ సమస్య తీరి నియోజవకర్గంలో టిడిపిని మరింత బలోపేతం చేసేందుకు ఉపయోగపడుతుందని ఆయన మద్దతుదారులు భావిస్తున్నారు. ఇదే సమయంలో ఆయన కుటుంబంలో ఇప్పటికే ఒక పదవి ఉన్నందున మరొకటి అవసరం లేదనే వాదన కూడా ఆ పార్టీ వర్గాల్లో కొందరి నుంచి వ్యక్తం అవుతోంది. ఎలాగైనా ఈ పదవిని చేపట్టాలన్న ఉద్దేశంతో ఇప్పటికే పల్లె రఘునాథరెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, టిడిపి ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ ద్వారా ఈ పదవి ప్రస్తావన తెస్తున్నట్లు సమాచారం.

పెద్ద సంఖ్యలో ఆశావహులు

పుడా ఛైర్మన్ పదవిని ఆశిస్తున్న వారిలో పుట్టపర్తి నుంచి చాలా మందే ఆశావహులు ఉన్నారు. టిడిపి తెలుగు యువత నాయకులు రామలక్ష్మణ్, బెస్త చలపతి, పిసి.గంగన్న, లోకేష్‌తో సన్నిహితంగా ఉన్న సురేష్ నాయుడు (ఊరు వాకిలి సురేష్), మాజీ పుడా ఛైర్మన్ కడియాల సుధాకర్, సామకోటి ఆదినారాయణ తదితరులు పేర్లు విన్పిస్తున్నాయి. వీరంతా అవకాశం వచ్చినప్పుడల్లా విజయవాడకు తమ బయోడేటా తీసుకుని వెళ్లి అదిష్టానానికి అందజేస్తున్నారు. ఇక ఈ పదవి కోసం టిడిపితో పాటు మిత్రపక్ష పార్టీలైన జనసేన, బిజెపి నాయకులు సైతం వారి ప్రయత్నాలు ముమ్మరంగానే చేస్తున్నారు. జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి పత్తి చంద్రశేఖర్ కూడా ఆ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి నామినేటెడ్ పోస్టు ఇప్పించాలని కోరుతున్నట్లు సమాచారం. పుడా ఛైర్మన్ కోసం పెద్ద ఎత్తున పోటీ ఉండడం, స్వయంగా పల్లె రఘునాథరెడ్డి ఈ పదవిని ఆశిస్తున్న సమయంలో అధిష్టానం ఎవరి వైపు మొగ్గు చూపుతుందా అన్న ఆశక్తి రాజకీయ వర్గాల్లో నెలకొంది.

నష్టపోయాం.. ఆదుకోండి..!

◆ కీలకమైన సమయంలో వర్షాభావం

◆ పంటలు చేతికందలేదు..

◆ కేంద్ర కరువు బృందంతో రైతులు

◆ ఉమ్మడి జిల్లాలో కేంద్ర కరువు బృందం పర్యటన

రాప్తాడులో కందికుంటను పరిశీలిస్తున్న కరువు బృందం సభ్యులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి, రాప్తాడు

'పంటకు కీలకమైన సమయంలో ఒకటిన్నర నెల పాటు తీవ్ర వర్షాభావం నెలకొంది. పంట మొత్తం నష్టపోయాం. పెట్టుబడులు కూడా చేతికందలేదు. పూర్తిగా నష్టపోయాం.. ఆదుకోండి.' అంటూ కేంద్ర కరువు బృందానికి ఉమ్మడి జిల్లా రైతులు విజ్ఞప్తి చేశారు. నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. 2024 ఖరీఫ్‌కు సంబంధించి నెలకొన్న కరువు పరిస్థితులను పరిశీలించేందుకు కేంద్ర కరువు బృందం బుధవారం నాడు ఉమ్మడి అనంతపురం జిల్లాలో పర్యటించింది. రూరల్ డెవలప్మెంట్ అండర్ సెక్రటరీ జయంతి కనోజియా, ఆయిల్ సీడ్స్ డెవలప్మెంట్ డైరెక్టర్ పొన్నుస్వామిలు ఈ బృందంలో సభ్యులుగా ఉన్నారు. వీరు మొదట సత్యసాయి జిల్లాలోని ముదిగుబ్బ మండలం జొన్నలకొత్తపల్లి గ్రామంలో పర్యటించారు. కంది, వేరుశనగ రైతులతో మాట్లాడారు. అనంతరం బత్తలపల్లి మండలం రాంపురం గ్రామం మీదుగా తాడిమర్రి మండలంలోని తాడిమర్రి గ్రామం వరకు పర్యటించారు. ఇక్కడ ఉలవ, జొన్న రైతులతో మాట్లాడి నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్నం నుంచి అనంతపురం జిల్లాలో కరువు బృందం పర్యటించింది. అనంతపురం జిల్లా అనంతపురం రూరల్ మండలంలోని మన్నీల గ్రామంలో మొదట కరువు బృందం పర్యటించింది. ఇక్కడ రైతు కొండప్ప పొలంలో పర్యటించి ఏ పంట వేశారు...ఏ మేరకు నష్టం జరిగిందన్న వివరాలను ఈ బృందం సేకరించింది. వేరుశనగ విత్తనం వేయగా ఒకటిన్నర నెల పాటు వర్షాభావం నెలకొందని కొండప్ప కరువు బృందానికి వివరించారు. దీని వల్ల దిగుబడి లేకుండా నష్టపోవాల్సి వచ్చిందని

జిల్లాలో నెలకొన్న కరువును తెలియజేస్తూ ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను చూస్తున్న కరువు బృందం సభ్యులు

చెప్పారు. అనంతరం రాప్తాడు మండల కేంద్రంలో కరువు బృందం పర్యటించింది. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లాలో 2024లో నెలకొన్న వాతావరణ పరిస్థితులను కలెక్టర్ వినోద్‌కుమార్ కరువు బృందం సభ్యులకు వివరించారు. అనంతరం రైతులతో ముఖాముఖి అయ్యారు. ఖరీఫ్‌లో కీలకమైన జులై, ఆగస్టు నెలలో తీవ్రమైన వర్షాభావం జిల్లాలో నెలకొందని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి కరువు బృందానికి తెలియజేశారు. కరువు ప్రకటించిన ఏడు మండలాల్లోనే కాకుండా ఇతర ప్రాంతాల్లోనూ ఇదే రకమైన వాతావరణం మూలంగా రైతులు నష్టపోయి ఉన్నారని చెప్పారు. అందరు రైతులను ఆదుకోవాలని కోరారు. సిపిఐ జిల్లా నాయకులు మల్లికార్జున మాట్లాడుతూ వర్షాభావంతో చాల చోట్ల భూగర్భ జలాలు కూడా తక్కువగా ఉన్నాయన్నారు. హంద్రీనీవాకు లైనింగ్ చేయవద్దని కోరారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లాకార్యదర్శి ఓ.నల్లప్ప రైతులను ఆదుకోవాలని కరువు బృందానికి వినతిపత్రం అందజేశారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత కరువు బృందాన్ని కలసి రైతులను ఆదుకోవాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

అన్నింటినీ కరువు మండలాలుగా ప్రకటించండి

కేంద్రకరువు బృందంతో సిపిఎం, రైతుసంఘం

జిల్లా రైతులను ఆదుకోవాలని వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం జిల్లాలోని 31 మండలానూ కరువు మండలాలుగా ప్రకటించాలని సిపిఎం, రైతుసంఘం నాయకులు కోరారు. ఈ మేరకు సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప, కార్యదర్శి వర్గ సభ్యులు బాలరంగయ్య, రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు టి.రామాంజనేయులు, రైతు సంఘం నాయకులు పోతులయ్య, డేవిడ్‌లు కేంద్ర కరువు బృందం సభ్యులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప మాట్లాడుతూ జిల్లాలో గత సంవత్సరం అతివృష్టి, అనావష్టితో రైతులు అన్ని రకాల పంటలను తీవ్రంగా నష్టపోయారన్నారు. పెట్టుబడులు కూడా చేతికందక అప్పుల ఊబిలో కూరుకుపోయారన్నారు. ఈ పరిస్థితుల్లో వారిని ఆదుకునే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాకు 10 వేల కోట్ల కరువు ప్యాకేజీని ప్రకటించి రైతుల అప్పులు మాఫీ చేయాలన్నారు. పంటసాగుచేసి నష్టపోయిన రైతులకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఆధారంగా గరిష్టంగా 4 హెక్టార్ల వరకు పరిహారం అందించాలన్నారు. వర్షాభావం వల్ల విత్తనం వేయని రైతులకు ఎకరాకు రూ.30 వేలు పరిహారం ఇవ్వాలని కోరారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 200 రోజుల పని, రోజుకు రూ.600 వేతనం చెల్లించి వలసలను ఆపాలన్నారు. పట్టణాల్లోనూ జాతీయ ఉపాధి పనులు కలిపించాలన్నారు. కౌలు రైతులకు కౌలు రద్దు చేసి పంటనష్టపరిహారం వాస్తవ సాగుదారులైన కౌలు రైతులకు చెల్లించాలన్నారు. గొర్రెలు, మేకల పెంపకందారులకు కరువు పింఛన్ ఇవ్వాలన్నారు. పాడి రైతులకు లీటర్‌కు రూ.10 కరువు బోనస్ చెల్లించాలన్నారు. తెల్లరేషన్‌కార్డు ఉన్న వారందరికీ బియ్యం, కందిపప్పు, గోధములు, చెక్కెర, మంచినూనె, వంటి 14 రకాల నిత్యావసర సరుకులు చౌకడిపోద్వారా అందించాలన్నారు. రెవెన్యూ గ్రామాల్లో పశుగ్రాసకేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌లు, ప్రభుత్వ కోల్డ్ స్టోరేజీలను ఏర్పాటు చేయాలని కోరారు.

నేడు డాకు మహారాజ్ ప్రీరిలీజ్ ఈవెంట్

హాజరుకానున్న మంత్రి నారా లోకేష్ - బాలకృష్ణతో పాటు చిత్ర యూనిట్...

ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం

హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ హీరోగా నటించిన డాకు మహారాజ్ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ గురువారం నాడు అనంతపురం నగరంలో జరుగనుంది. సాయంత్రం జరిగే ఈ ఈవెంట్‌కు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. అనంతపురం నగరం శ్రీనగర్ కాలనీలోని ముత్యాల్‌రెడ్డి గ్రౌండ్స్‌లో ఈవెంట్ జరగనుంది. భద్రతా ఏర్పాట్లను ఎస్పీ జగదీశ్ నేరుగా పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు సభా ప్రాంగణానికి స్వయంగా వెళ్లి పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లకు తీసుకోవాల్సిన చర్యలపై నిర్వాహకులకు సూచనలు చేశారు. ఈవెంట్‌కు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కూడా విచ్చేస్తున్నారు. ఈయనతో పాటు హీరో బాలకృష్ణ, చిత్ర యూనిట్ సభ్యులందరూ కూడా హాజరుకానున్నారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనే అవకాశం ఉన్న నేపథ్యంలో అందుకు తగ్గట్టుగా నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

అన్ని వసతులతో అహుడా-ఎంఐజి లేఅవుట్‌లు

ఛైర్మన్ టిసి.వరుణ్

బ్రోచర్లు విడుదల చేస్తున్న అహుడా ఛైర్మన్, జాయింట్ కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అన్ని వసతులతో అహుడా-ఎంఐజి లేఅవుట్‌లను అందుబాటులోకి తీసుకుని వస్తున్నట్లు అహుడా ఛైర్మన్ టిసి.వరుణ్ తెలియజేశారు. కూడేరు, గుత్తి, మడకశిర ప్రాంతాల్లో వేసిన నూతన లేఅవుట్‌లకు సంబంధించిన బ్రోచర్లను బుధవారం స్థానిక అహుడా కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వరుణ్ మాట్లాడుతూ ప్రజలకు అన్ని వసతులతో సొంతింటిని అందించేందుకు అహుడా ముందుకు వస్తోందన్నారు. అందులో భాగంగానే అహుడా, ఎంఐజి లేఅవుట్‌లను అందుబాటులోకి తెచ్చామన్నారు. ఇప్పటికే ధర్మవరం కునుతూరులో 120 ఎకరాల్లో అహుడా ఆధ్వర్యంలో లేఅవుట్లను ఏర్పాటు చేశామన్నారు. అక్కడ ఇంకా ప్లాట్లు మిగిలి ఉన్నాయన్నారు. కందుకూరు లేఅవుట్లో స్థలాలన్నీ అమ్ముడయ్యాయన్నారు. ప్రస్తుతం మడకశిర, కూడేరు గుత్తిలో ఏర్పాటు చేస్తున్న ఎంఐజి లేఅవుట్లలో ఉద్యోగులు, ప్రజలు స్థలాలకై అడ్వాన్స్ బుకింగ్ చేసుకోవాలని కోరారు. ఒకేసారి స్థలానికి సంబంధించిన మొత్తం చెల్లించిన వారికి ఐదు శాతం రాయితీ ఇవ్వనున్నట్లు చెప్పారు. 20 శాతం స్థలం విలువలు చెల్లించి వారికి కేటాయించిన ప్లాటును అడ్వాన్స్ బుకింగ్ చేసుకోవచ్చన్నారు. అన్ని వసతులతో ఈ లేవుట్‌లను అందుబాటులోకి తెస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్లానింగ్ ఆఫీసర్ కమ్మూరు మహమ్మద్ ఇషాక్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దుష్యంత, కార్యదర్శి గౌరీ శంకర్, టిపిఒ హరీష్ చౌదరి, శరత్ పాల్గొన్నారు.

జెఎన్‌టియును అగ్రభాగాన నిలుపుదాం

ఇన్‌ఛార్జి విసి హెచ్.సుదర్శన రావు

ప్రజాశక్తి -అనంతపురం

అనంతపురం జెఎన్‌టియును బోధన, బోధనేతర సిబ్బంది సమిష్టి సహకారంతో జాతీయ ర్యాంకింగ్‌లో అగ్రభాగాన నిలుపుదామని ఇన్‌ఛార్జి ఉపకులపతి హెచ్.సుదర్శన రావు తెలిపారు. వర్సిటీలోని ఆర్యభట్ అడిటోరియంలో అకాడమిక్ ప్లానింగ్ డైరెక్టర్ ఎస్వీ సత్యనారాయణ అధ్యక్షతన అనంతపురం జెఎన్‌టియు-2025 క్యాలెండర్, ఆప్కాస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విసితో పాటు రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, ఓస్‌డిటు వీసీ ఎన్.దేవన్నలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ వర్శిటీ అబివద్ధికి ప్రతి ఉద్యోగి తోడ్పాటు అవసరమన్నారు. 2025 సంవత్సరంలో

క్యాలెండర్లను విడుదల చేస్తున్న ఇన్‌ఛార్జి విసి, తదితరులు

మంచి మెరుగైన జాతీయ ర్యాంకింగ్, నాక్ నుంచి మంచి గ్రేడ్ వచ్చే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. రిజిస్ట్రార్ కృష్ణయ్య మాట్లాడుతూ అధ్యాపకులు, భోధనేతర సిబ్బంది, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది కలిసి కట్టుగా పనిచేస్తే యూనివర్సిటీ మరింత అభివృద్ధిలో ముందుకు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిఎపి డైరెక్టర్ ఎస్‌వి.సత్యనారాయణ, యూనివర్సిటీ డైరెక్టర్లు సురేష్ బాబు, నాగప్రసాద్ నాయుడు, దుర్గా ప్రసాద్, సుజాత, వైశాలి గొర్పడే, వర్శిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఏపీ. శివకుమార్, ఓటిపిఆర్ఐ డైరెక్టర్ జివి.సుబ్బారెడ్డి, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వసుంధర, పులివెందుల కళాశాల ప్రిన్సిపాల్ విష్ణు తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేలు, పేకాట ఆడితే చర్యలు : ఎస్పీ

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

సంక్రాంతి పండుగ సందర్భంగా సాంప్రదాయక క్రీడల పేరుతో జిల్లాలో ఎక్కడైనా కోడిపందేలు, పేకాట ఆడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని ఎస్పీ పి.జగదీష్ హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కోడిపందేలు, పేకాట నిర్వహుకులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జూద క్రీడలు కాకుండా సాంప్రదాయ ఆటలు ఆడుకోవాలని సూచించారు. జూదం ఏదైనా ప్రజల జీవితాలను నాశనం చేస్తుందన్నారు. కోడి పందేల జూదరులు, కోడి కత్తులు తయారీదారులు, పేకాట, నిర్వహకులపై ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నారన్నారు. యువత ఇలాంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. ఇలాంటి వాటిలో పాల్గొంటే పోలీసు కేసులు నమోదై వారి జీవితాలు నాశనం అవుతాయన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఎవరైనా జిల్లాలో కోడి పందేలు నిర్వహిస్తుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

యుటిఎఫ్ రాష్ట్ర కమిటీలో జిల్లా నుంచి ఇద్దరికి చోటు

ఎస్‌వివి.రమణయ్య

దేవేంద్రమ్మ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కాకినాడ నగరంలో జరిగిన యుటిఎఫ్ రాష్ట్ర స్వర్ణోత్సవ మహా సభలో రాష్ట్ర కార్యవర్గంలో జిల్లాకు చెందిన ఇద్దరికి చోటు దక్కింది. జిల్లాకు చెందిన దేవేంద్రమ్మకు వరుసగా నాలుగవసారి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలుగా, రమణయ్యకు రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులుగా అవకాశం దక్కింది. వీరి ఎంపికై యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య, సహాధ్యక్షులు రామప్ప, సరళ, కోశాధికారి రాఘవేంద్ర తదితరులు అభినందనలు తెలిపారు.

ప్రజల ఆనందమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ

అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-యల్లనూరు

ప్రజల ఆనందమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ తెలిపారు. యల్లనూరులో జరుగుతున్న సిసి రోడ్లు, డ్రెయినేజీ పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 7 నెలల్లోనే యల్లనూరులో రూ.95లక్షలతో సిసి రోడ్లు డ్రెయినేజీలతో పాటు పలు అభివద్ధి పనులు ప్రారంభించామన్నారు. త్వరలోనే ఈ పనులను పూర్తి చేస్తామని తెలియజేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో గ్రామపంచాయతీల నిధులను దారి మల్లించారన్నారు. అభివృద్ధిలో భాగంగా ఒక ఇటుక కూడా పేర్చకుండా ఐదేళ్లు పాలన సాగించారని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను అమలు చేసేలా రాష్ట్రంలో ప్రస్తుత పాలన సాగుతోందన్నారు. అనంతరం శ్రీ పెద్దమ్మ తల్లి అమ్మవారికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు జరిపించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రాజు, ఎంపిడిఒ వాసుదేవరరెడ్డి, ఈఒఆర్డీ మనోహర్ బాబు టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జెఎన్‌టియు బీటెక్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి -అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు పరిధిలో బీటెక్ ఫలితాలను ఇన్‌ఛార్జి ఉపకులపతి హెచ్.సుదర్శన రావు, రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య గురువారం విడుదల చేశారు. నవంబర్, డిసెంబర్ నెలలలో నిర్వహించిన బీటెక్ రెండవ సంవత్సరం, ఒకటవ సెమిస్టర్ (ఆర్-23) రెగ్యులర్, బీటెక్ రెండవ సంవత్సరం ఒకటవ సెమిస్టర్ (ఆర్ 20) సప్లిమెంటరీ, బీటెక్ ఒకటవ సంవత్సరం ఒకటవ సెమిస్టర్ (ఆర్19) సప్లిమెంటరీ బీటెక్ రెండవ సంవత్సరం ఒకటవ సెమిస్టర్ (ఆర్ 15) సప్లిమెంటరీ, బీటెక్ రెండవ సంవత్సరం రెండవ సెమిస్టర్ (ఆర్ 20, 19, 15) సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ అఫ్ ఎవాల్యుయేషన్ వి.నాగప్రసాద్ నాయుడు, కంట్రోలర్ అఫ్ ఎగ్జామినేషన్ ఎపి.శివ కుమార్, అడిషినల్ కంట్రోలర్స్ జి.శంకర్ శేఖర్ రాజు, డా॥ఎం.అంకారావు, డా॥ఎస్.శ్రీధర్ పాల్గొన్నారు.

గదుల వేలం మళ్లీ వాయిదా

రాయదుర్గం : పట్టణంలోని మున్సిపల్ కూరగాయల మార్కెట్ మొదటి అంతస్తులో ఉన్న గదుల వేలం మరోమారు వాయిదా పడినట్లు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. మొదటి అంతస్తులో ఎ, బి బ్లాక్‌లో 40 గదులకు గుడ్ విల్ ప్రాతిపదికన బుధవారం మున్సిపల్ అధికారులు వేలం నిర్వహించగా పాట పాడిందుకు ఏ ఒక్కరూ ముందుకు రాలేదు. ఈ గదుల వేలం వాయిదా పడటం ఇది ఐదో సారి. ఈ గదులు నిర్మించి ఏడాదికి పైనే అయినా వేలం పాడేందుకు వ్యాపారులు ముందుకు రాకపోవడానికి గుడ్ విల్, అద్దె ఎక్కువగా నిర్ణయించడం, సరైన మెట్ల సౌకర్యం లేకపోవడమే కారణమని తెలుస్తోంది.

ఎస్‌విఐటికి న్యాక్ గుర్తింపు

రాప్తాడు : మండలంలోని శ్రీవెంకటేశ్వర ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల (ఎస్‌విఐటి)కు నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్(ఎన్ఎఎసి) గుర్తింపు దక్కడం గర్వకారణంగా ఉందని కరస్పాండెంట్ విబిఆర్.శర్మ, ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి, వైస్ ఛైర్మన్ వెన్నపూస రవీంద్రారెడ్డి తెలిపారు. కళాశాల ఎండి వెన్నపూస రమాకాంత్‌రెడ్డి, ప్రిన్సిపల్ డా. టి.విష్ణువర్ధన్ మాట్లాడుతూ నైపుణ్యాలను పెంపొందించు కుంటేనే యువతకు ఉద్యోగావకాశాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఏఓ వి.వెంకటశివారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీలో గందరగోళం

సంక్రాంతి కానుక ఇవ్వండి

10న తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం ఆందోళన

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా పండుగలకు చంద్రన్న కానుకను ఇవ్వాలని, రేషన్ పంపిణీలో గందరగోళాన్ని నివారించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10వ తేదీన అనంతపురం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గత ఆరు నెలలుగా రేషన్ పంపిణీలో తీవ్ర గందరగోళం నెలకొని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఉగాది, రంజాన్, క్రిస్మస్ పండుగలకు చంద్రన్న కానుక ఇవ్వకుండా కూటమి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. రేషన్ షాపుల ద్వారా బియ్యం, కంది బ్యాళ్లు, చక్కెర సక్రమంగా పంపిణీ జరగలేదన్నారు. రెండు రోజులు మాత్రమే డీలర్లు రేషన్ ఇస్తున్నారన్నారు. రేషన్ ఎప్పుడిస్తారో కూడా తెలియని పరిస్థితి ఉందన్నారు. ఈ నేపథ్యంలో సంక్రాంతి కానుక, రేషన్ బియ్యం సక్రంగా పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10వ తేదీన తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రేషన్‌కార్డు లబ్ధిదారులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

వాహనాలు తనిఖీ చేస్తున్న సిఐ

వాహన దారులు రోడ్డు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సిఐ కరుణాకర్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో వాహన తనిఖీని చేపట్టారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ వాహనాలకు సంబంధించిన అన్ని రికార్డులను వారి వద్ద ఉంచుకోవాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరిస్తాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

గ్రామసభల ద్వారా ప్రజల సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే జెసి.అస్మిత్‌రెడ్డి తెలిపారు. మండలంలోని చిన్నయక్కలూరు, చెర్లపల్లి గ్రామాల్లో బుధవారం గ్రామసభలు నిర్వహించారు. ఆయా సభల్లో ఎమ్మెల్యే పాల్గొని ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకే కృషి చేస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనతి కాలంలోనే గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు వేయిస్తున్నామని, అధికారులు ప్రజల వద్దకే వచ్చి సమస్యలను తెలుసుకుని పిటిషన్లను త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారన్నారు. ప్రధానంగా రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలకు పరిష్కారం చూపుతున్నారన్నారు. చిన్నయక్కలూరు సభలో శ్మశానవాటిక, దోబీఘాట్‌కు స్థలం చూపాలని, భూ సమస్యలను వివరించారు. చర్లపల్లిలో ఎమ్మెల్యే పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. గ్రామసభలో ఇళ్లకు సంబంధించిన పొజిషన్ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. భూ సమస్యలు, పింఛన్లు, తదితర సమస్యలను విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే ఆయా సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ బాలాజీరాజు, ఎంపిడిఓ శకుంతలమ్మ, ఈఓఆర్‌డి సురేష్‌బాబు, ఎపిఓ గంగరాజు, ఎంఈఓ ఓబులకొండ, మండల ఇంజినీర్ ప్రసన్నకుమార్, టిడిపి సీనియర్ నాయకులు రామకృష్ణారెడ్డి, శశిధర్‌రెడ్డి, ప్రతాపరెడ్డి, అశ్వత్థరెడ్డి, సంజీవరెడ్డి, నారాయణరెడ్డి, డీలర్ నారాయణరెడ్డి, పెద్దిరెడ్డి, వెంకట శివారెడ్డి, చెన్నారెడ్డి, కుసుమారెడ్డి పాల్గొన్నారు.

ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి

తూట్రాలపల్లెలో రెవెన్యూ సదస్సు

యాడికి : మండలంలోని తూట్రాలపల్లె గ్రామంలో తహశీల్దార్ ప్రతాపరెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వివిధ భూ సమస్యలపై 40 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసులు, ఆర్‌ఐ కిష్టప్ప, పంచాయతీ కార్యదర్శి మహేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపిపి వేలూరు రంగయ్య, సర్పంచ్ సంజీవరాయుడు, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిరుపేదలకు వరం సిఎంఆర్ఎఫ్ : ప్రభుత్వ విప్

ప్రజాశక్తి-రాయదుర్గం

రోగాలతో సతమతమవుతూ వైద్యం చేయించుకోలేక ఇబ్బంది పడుతున్న నిరుపేద కుటుంబాలకు వరం 'ముఖ్యమంత్రి సహాయ నిధి' అని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని 16 కుటుంబాలకు సిఎంఆర్ఎఫ్ నుంచి రూ. 22.75 లక్షలు మంజూరైంది. ఆ చెక్కులను బుధవారం కాలవ పట్టణంలో ఆయా కుటుంబాలకు అందజేశారు. జుంజురాంపల్లి గ్రామానికి చెందిన రెప్పకట్ల మంజుల బ్రెయిన్ ఫీవర్‌తో మృతిచెందగా ఆమె భర్త రామాంజనేయులుకు రూ. 1.2 లక్షల చెక్కు అందజేశారు. రాయదుర్గం పట్టణానికి చెందిన డి.సల్మా కడుపులో ఇన్ఫెక్షన్‌కు చికిత్స పొందింది. ఆమె భర్త షఫిక్‌కు రూ. 4,24,405, కనేకల్లు మండలంలోని మారంపల్లి గ్రామానికి చెందిన కొనకొండ్ల రవి ఓ ప్రమాదంలో గాయపడి 3 నెలలు కోమాలోకి వెళ్లాడు. ఆ కుటుంబానికి రూ. 5,36,636 చెక్కు అందజేశారు. మొత్తం 16 మందికి రూ. 22,75,609 చెక్కులు అందజేశారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

బాల బాలికలు విద్యతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సూచించారు. పట్టణంలోని వాణి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో క్రీడా పోటీల విజేత విద్యార్థులకు నిర్వహించిన బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో కాలవ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడలు దినచర్యలో ఓ భాగం కావాలన్నారు. తమపై తమకు ఆత్మ విశ్వాసం ఏర్పడితే విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించడానికి వీలుంటుందన్నారు. ఉత్తమ క్రీడాకారులు తయారయ్యేలా పాఠశాల యాజమాన్యం మరింత శ్రద్ధపెట్టి ప్రోత్సహించాలన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందుకున్న వారితో ప్రభుత్వ విప్ కాలవ

క్యాన్సర్ కేర్ ఆసుపత్రి ఏర్పాటుకు 'నాట్కో' గ్రీన్‌సిగ్నల్

శాసన మండలి ప్రివిలేజ్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి హర్షం

ప్రజాశక్తి-ఉరవకొండ

అనంతపురంలో రూ. 45 కోట్ల వ్యయంతో 110 పడకల క్యాన్సర్ కేర్ ఆసుపత్రి ఏర్పాటు చేయడానికి నాట్కో ఫార్మా సంస్థ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం హర్షణీయమని శాసనమండలి ప్రివిలేజ్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి తెలిపారు. వజ్రకరూరు మండలం కొనకొండ్ల గ్రామంలోని తన నివాసంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాట్కో ఫార్మా సంస్థ గుంటూరులో క్యాన్సర్ కేర్ ఆసుపత్రి ఏర్పాటు చేసిన విషయం తెలిసి నాట్కో ఛైర్మన్ నన్నపనేని వెంకయ్యచౌదరిని కలిసి అనంతపురంలో జిల్లాలో అలాంటి ఆసుపత్రి ఏర్పాటు చేయాలని రెండేళ్లుగా ప్రయత్నాలు చేశానన్నారు. అలాగే మాజీ సిఎం జగన్, ప్రస్తుత సిఎం చంద్రబాబు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణబాబును, జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కోరానన్నారు. స్పందించిన నాట్కో ఫార్మా కంపెనీ క్యాన్సర్ కేర్ ఆసుపత్రి ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో తన కృషి ఫలించిందని తెలిపారు. ఆసుపత్రి ఏర్పాటుకు జిల్లా అధికారులు తదుపరి చర్యలను వేగవంతం చేయాలని కోరారు. సమావేశంలో వైసిపి నాయకులు కాకర్ల నాగేశ్వరరావు, సోమర యాదవ్, రమణయాదవ్, రమణారెడ్డి, రామచంద్ర, తిప్పయ్య, సర్పంచులు జయేంద్రరెడ్డి, శివలింగ, తిరుపాల్‌యాదవ్, నాయకులు శంకర్‌రెడ్డి, తిప్పారెడ్డి, చెన్నబసన్నగౌడ్, బోయ రాంబాబు, సూరి, మహాలింగ, లాలెప్ప, గురు, మునెయ్య ముద్దయ్య,, కేశన్న, ఎర్రిస్వామి పాల్గొన్నారు.

పంచాయతీలను అభివృద్ధి చేద్దాం

ప్రజాశక్తి-నార్పల

పంచాయతీల అభివృద్ధికి కృషి చేద్దామని ఎంపిడిఓ గంగావతి, ఈఓఆర్‌డి శైలజా రాణి పిలుపునిచ్చారు. స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో బుధవారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో పన్నుల వసూలు, పారిశుధ్యం, తాగునీరు, తదితర వాటిని నిరంతరం పర్యవేక్షించాలన్నారు. 'పల్లె పండగ'లో భాగంగా గ్రామాల్లో చేపట్టిన సీసీ రోడ్ల పనులను పర్యవేక్షించాలని, ఎంఈఎంఎస్ సర్వే వేగవంతం చేయాలని, పెండింగ్ ఒడిఎఫ్ ప్లస్ సర్వే పూర్తి చేయాలని, చెత్త సంపద కేంద్రాలను స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో వినియోగంలోకి తీసుకు రావాలన్నారు. వైద్య సిబ్బంది సహకారంతో ప్రజలకు సీజనల్ వ్యాధులు, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. సచివాలయ సిబ్బంది ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. సమావేశంలో కార్యాలయ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ఉమాదేవి, పంచాయతీ కార్యదర్శులు శ్యామల, శ్రీనివాసులు, వెంకటరమణ, లక్ష్మీదేవి, వరలక్ష్మి, మాధవి, కుళ్లాయప్ప, కీర్తన, గోపాల్‌రెడ్డి, శ్రీహర్ష, మల్లికార్జున, చినరాయుడు, ఆదినారాయణ, పరుశురాం, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఓ గంగావతి

రేపు జాబ్‌మేళా

ప్రజాశక్తి-నార్పల

స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 10వ తేదీ ఎపిఎస్ఎస్‌డిసి ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ గంగావతి, ప్రిన్సిపల్ దేవిక, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పివి ప్రతాప్‌రెడ్డి తెలిపారు. జాబ్‌మేళాలో ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయని, ఇంటర్, డిగ్రీ, పీజీ చదివిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు పాలిటెక్నిక్ కళాశాలలో కోఆర్డినేటర్లను సంప్రదించాలని తెలిపారు.

రాయదుర్గం రూరల్ : స్థానిక కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 10వ తేదీ ఎపి నైపుణ్యాభివృద్ధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ రఘురామ్మూర్తి తెలిపారు. ప్రముఖ కంపెనీలు 230 ఉద్యోగాలకు అభ్యర్థులను ఇంటర్వ్యూ చేస్తారన్నారు. ఇంటర్, డిగ్రీ, బిటెక్, ఐటిఐ, డిప్లొమా పూర్తి చేసిన వారు అర్హులన్నారు. ఉదయం 10 గంటలకు కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హాజరు కావాలన్నారు.

గరుగు చింతలపల్లి చెరువుకు నీరు విడుదల

ప్రజాశక్తి-పుట్లూరు

మండలంలోని కోమటికుంట్ల చెరువు నుంచి గరుగు చింతలపల్లి చెరువుకు బుధవారం ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ నీరు విడుదల చేశారు. దీంతో గ్రామాల్లో తాగునీటి సమస్య కొద్దిగా పరిష్కార మైనట్లు అనిపించింది. రైతులు కోమటికుంట్ల కులశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల హామీ మేరకు ఎమ్మెల్యే పుట్లూరు, కోమటికుంట్ల, గరుగు చింతలపల్లి చెరువులకు నీరు విడుదల చేసి మాట నిలబెట్టుకుందన్నారు. కాలువల్లో ముళ్లపొదలు తొలగించినందుకు తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీని, హెచ్‌ఎల్‌సి అధికారులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఏఈ శ్రీనివాసులు, నాగేశ్వరరెడ్డి, తాడిపత్రి డిస్ట్రిబ్యూటరీ అధ్యక్షురాలు ప్రమీలమ్మ, పుట్లూరు సాగునీటి సంఘం ఉపాధ్యక్షుడు రవికుమార్‌రెడ్డి, గూడూరు, కడవకల్లు సాగునీటి సంఘాల అధ్యక్షులు పెదనాగిరెడ్డి, శ్రీనివాసునాయుడు, మండల తెలుగు యువత అధ్యక్షులు విజయ్‌కుమార్‌రెడ్డి, ఎల్‌కె.చెన్నారెడ్డి, శివనారాయణరెడ్డి, రామచంద్రనాయుడు, నారాయణరెడ్డి, బ్రహ్మయ్య, శివారెడ్డి, రామా నాయుడు, రైతులు పాల్గొన్నారు.

నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

వసతి గృహం పరిశీలన

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

ప్రతి పాఠశాల, వసతి గృహంలో ఫిర్యాదుల బాక్స్ ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ తెలిపారు. నగరంలోని గిల్డ్ ఆఫ్ సర్వీస్ పాఠశాల పక్కన ఉన్న సాంఘిక సంక్షేమ వసతి గృహంలో పునరుద్ధరణ పనులు పూర్తి కాగా బుధవారం ఎమ్మెల్యే టిడిపి జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, విద్యాశాఖ అధికారులతో కలిసి ప్రారంభించారు. వసతి గృహంలో సౌకర్యాలపై ఆరా తీశారు. విద్యార్థులను అడిగి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 40 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ భవనం గురించి పట్టించుకున్న వారెవరూ లేరన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొస్తున్నారన్నారు. ఆయన ప్రతి జిల్లాలో ఓ పాఠశాలను విజిట్ చేస్తున్నారని, మన జిల్లాలో ఫిబ్రవరిలో మంత్రి పర్యటన ఉండొచ్చన్నారు. జిల్లా వ్యాప్తంగా 501 పాఠశాలల్లో పునరుద్ధరణ పనులు చేస్తున్నట్లు వివరించారు. బిసి, ఎస్సీ సంక్షేమ వసతి గృహాల్లోనూ పనులు చేపట్టనున్నట్టు తెలిపారు. ఇక నుంచి ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో ఆకస్మిక తనిఖీలు ఉంటాయని తెలిపారు. వసతి గృహంలో ఆర్‌ఓ ప్లాంట్ చెడిపోయిందని చెప్పగా వెంటనే మరమ్మతులు చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

హాస్టల్‌లో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలి

ప్రజాశక్తి-అనంతపురం

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ నూతన సహాయ సంచాలకులుగా బి.వినోద్‌కు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి, అనంత దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో నాయకులు ఆయనను కలిసి పూలబొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. వారు మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అందరికీ అందేలా, అన్ని ప్రభుత్వ శాఖల్లో ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సాకే ఆంజనేయులు, ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ హరినాథ్‌రెడ్డి, రసూల్, దివ్యాంగ ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామాంజనేయులు, మనోహర్, సభ్యులు ధనుంజయ, ప్రసాద్, శేఖర్, చరణ్, రాజేష్ పాల్గొన్నారు.

వినోద్‌కుమార్‌కు పూలబొకే ఇస్తున్న డిహెచ్‌పిఎస్ నాయకులు

వైద్య ఆరోగ్య శాఖలో ఉద్యోగాల భర్తీ : డిఎంహెచ్‌ఒ

అనంతపురం : జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలో ఖాళీగా ఉన్న ఫోర్త్ క్లాస్ ఉద్యోగాలను పొరుగు సేవల ద్వారా భర్తీ చేస్తున్నామని డిఎంహెచ్‌ఒ డాక్టర్ ఈబి.దేవి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎఫ్‌ఎన్‌ఒ-18, శానిటరీ అటెండర్ కం వాచ్‌మెన్-11 పోస్టుల భర్తీకి ఈ నెల 20వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. https://anantapuramu.ap.gov.in వెబ్‌సైట్‌లో సంప్రదించాలన్నారు.

రైతులపై వేధింపులు తగదు

ప్రజాశక్తి-గార్లదిన్నె

వ్యవసాయ సాంకేతిక సలహాలు అందించి రైతులను అభివృద్ధి పథంలో నడిపించడానికి గార్లదిన్నెలో స్థాపించిన దక్షిణ వ్యవసాయ పరిశోధన కేంద్రం(ట్రాక్టర్‌నగర్) ప్రస్తుత డైరెక్టర్ రైతుల పొలాలకు దారి లేకుండా చేస్తూ తీవ్ర ఇబ్బందులు గురి చేస్తున్నారని సిపిఎం మండల కార్యదర్శి చెన్నారెడ్డి తెలిపారు. పశువులు, గొర్రెలకాపరులు మేత కోసం అటువైపు వెళ్లినప్పుడు సిబ్బందితో దాడి చేయిస్తున్నారని మండిపడ్డారు. 50 ఏళ్లుగా ఉన్న రహదారులను కుదించి రైతులు అటువైపు వెళ్లకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నారన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకొని రైతులకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

గంగ జాతరకు 'బొందలవాడ' విరాళం

ప్రజాశక్తి-నార్పల

నార్పలలో ఈ నెల 21వ తేదీ నిర్వహిస్తున్న గంగమ్మతల్లి జాతర నిర్వహణకు బుధవారం టిడిపి నాయకులు, శివక్రిష్ణ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ బొందలవాడ శివకృష్ణచౌదరి రూ. 25 వేలు విరాళం ఇచ్చారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధి కొండిశెట్టి ప్రవీణ్ కుమార్, ఆలయ కమిటీ సభ్యులు సూర్యప్రకాష్, తిరుమల నాయుడు, నరేష్, పాపన్న, పెద్దన్న, వెంకటయ్య, గంగాధర, నాగరాజు, మల్లికార్జున, నీలకంఠ పాల్గొన్నారు.

120 మంది పింఛనుదారులకు నోటీసులు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండలంలోని 33 గ్రామాల్లో సదరం క్యాంపులో మంజూరు చేసిన ధ్రువీకరణ పత్రాలు లేని 120 మంది పింఛనుదారులకు నోటీసులు జారీ చేసినట్లు ఎంపిడిఓ దాస్‌నాయక్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ వైద్య బృందం ఇంటింటికీ వెళ్లి పింఛనుదారుల వద్ద ఉన్న ధ్రువీకరణ పత్రాలు సరైనవా కాదా అని పరిశీలిస్తారన్నారు. కొందరు వికలాంగులు నకిలీ ధ్రువీకరణ పత్రాలతో పింఛను పొందుతున్నారని, అలాంటి వారిని ఏరి వేసేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.

మెడికోలకు సంక్రాంతి ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి-అనంతపురం

యువత సంస్కృతి, సంప్రదాయాలను మరచిపోకూడదని మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య డాక్టర్ ఎస్.మాణిక్యరావు సూచించారు. నగరంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో బుధవారం మెడికల్ విద్యార్థులు, పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బందికి రంగోలి పోటీలు నిర్వహించారు. మెడికోలు సంప్రదాయ వేషధారణలో వచ్చి ముగ్గులు వేశారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ వైద్య విద్యార్థులకు చదువుతో పాటు దేశ, రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, పండుగల ప్రాముఖ్యతను తెలియజేయాలనే ఉద్దేశంతో పాటు వారిలో ఉన్న కళా ప్రతిభను వెలికి తీసేందుకు ఈ పోటీలు నిర్వహించామన్నారు. విజేతలకు ప్రిన్సిపల్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆచార్య డాక్టర్ షారోన్ సోనియా, ఆచార్య డాక్టర్ తెలుగు మధుసూదన్, ఆచార్య డాక్టర్ కెవిఎల్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ కెవి చలపతి, సీనియర్ డాక్టర్లు డాక్టర్ ఎంఎస్ ప్రసాద్, డాక్టర్ విజయ కుమారి, డాక్టర్ సుమన గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలో ఉన్న మెడికోలు

శ్రీచైతన్యలో 'భేటీ సమ్మాన్-రెస్పెక్ట్ ద గర్ల్స్'

ప్రజాశక్తి-అనంతపురం

స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా బుధవారం నగరంలోని కమ్మభవన్ సమీపంలో ఉన్న శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 'భేటీ సమ్మాన్- రెస్పెక్ట్ ద గర్ల్స్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా శ్రీచైతన్య పాఠశాలల ఎజిఎం సుబ్బారెడ్డి, ఐసిడిఎస్ పిడి వనజ అక్కమ్మ హాజరయ్యారు. ఎజిఎం ప్రస్తుత సమాజంలో అమ్మాయిలు, మహిళల పాత్రను వివరించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. మహిళలకు విలువ, గౌరవం, రక్షణ ఇవ్వాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఐసిడిఎస్ పిడి మాట్లాడుతూ సమాజం ఎప్పుడైతే బాలికలను గౌరవిస్తుందో అప్పుడే సమాజాభివృద్ధి, దేశాభివృద్ధి జరుగుతుందన్నారు. బాలికలకు 'టచ్ -డోంట్ టచ్'పై అవగాహన కల్పించారు. బాలికల రక్షణకు చాలా మంచి చట్టాలు ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకొని తమను తాము రక్షించుకుంటూ చదువులో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ విశ్వనాథ్, కోఆర్డినేటర్ రాధాకృష్ణనాయుడు, డీన్ రిషిబాల, అసిస్టెంట్ డీన్ ముత్యాలన్న, క్యాంపస్ ఇన్‌ఛార్జి రామకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎజిఎం సుబ్బారెడ్డికి పూలబొకే ఇస్తున్న విద్యార్థులు

కాశ్మీర్ ఉత్సవమేళా ఎగ్జిబిషన్ ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని గుత్తి రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన కాశ్మీర్ ఉత్సవమేళా-2025 ఎగ్జిబిషన్ ను బుధవారం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ లాంఛనంగా ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నగర ప్రజలు సాయంత్రం వేళ సంతోషంగా గడపడానికి ఇలాంటి వేదికలు అవసరమన్నారు. ఎగ్జిబిషన్ నిర్వాహకులు రఘుప్రసాద్ మాట్లాడుతూ అమ్యూజ్మెంట్, ఆట వస్తువులు, తినుబండారాలు, ఘర్ సంసార్ వంటి వాటితో పాటు ఈ ఏడాది ప్రత్యేకంగా మినీ కాశ్మీర్‌ను పరిచయం చేస్తూ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశామని తెలిపారు. పిల్లల వినోదం కోసం జాయింట్ వీల్, బ్రేక్ డాన్స్, పలు పిల్లల ఐటమ్స్ ప్రజలకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సరిపూటి రమణ, కుంచెపు వెంకటేష్, చరిత, ఎగ్జిబిషన్ నిర్వాహకులు రాజేష్, చందు, శ్రీకాంత్, జానీ, మేనేజర్ నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

కాశ్మీర్ ఉత్సవమేళా ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

10 నుంచి పిల్లలకు ఉచిత శిక్షణ శిబిరం

ప్రజాశక్తి-అనంతపురం

సంక్రాంతి సందర్భంగా నగరంలోని క్రిష్ణకళామందిర్‌లో ఈ నెల 10వ తేదీ నుంచి ఉచితంగా డాన్స్, డ్రాయింగ్, పెయింటింగ్ నేర్పిస్తామని నిర్వాహకులు కత్తి విజయ్‌కుమార్ తెలిపారు. పిల్లలు సంక్రాంతి సెలవులను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 83093 32848లో సంప్రదించాలన్నారు.

వైసిపి అధినేత జగన్‌ను కలిసిన గోవిందు

ప్రజాశక్తి-గుమ్మఘట్ట

వైసిపి అధినేత, మాజీ సిఎం వైఎస్.జగన్మోహన్‌రెడ్డిని ఆ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి బిటిపి గోవిందు తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభా కాంక్షలు తెలిపారు. గోవిందు మాట్లాడుతూ రాయదుర్గం నియోజకవర్గంలో వైసిపి పరిస్థితి, దళితుల సమస్యలను అధినేత జగన్‌కు వివరించినట్లు తెలిపారు.

జగన్‌ను కలిసిన గోవిందు

ఒరిగిన విద్యుత్ స్తంభం.. తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి-శింగనమల

శింగనమలలోని చిన్న కాలువ వీధిలో బుధవారం విద్యుత్ కార్మికుడు స్తంభానికి లైట్ అమరుస్తుండగా ఒక్కసారిగా పక్కకు ఒరిగింది. దీంతో కార్మికుడు కిందకు దూకి ప్రాణం రక్షించుకున్నాడు. లైట్ మార్చేందుకు విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. విద్యుత్ స్తంభం ఒరిగిన సమయంలో విద్యుత్ తీగలు తెగి నడిరోడ్డుపై పడ్డాయి. విద్యుత్ సరఫరా లేకపోవడంతో అంతా ఊపిరిపించుకున్నారు.

బెంగళూరులో వలస కూలీ మృతి

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

మండలంలోని అజ్జయ్యదొడ్డి గ్రామానికి చెందిన గొల్ల పూజారి చిన్న రాజన్న(42) బెంగళూరులో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వివరాలు.. చిన్నరాజన్న జీవనోపాధి కోసం పదేళ్ల క్రితం సొంతూరు వదిలి కర్నాటకలోని బెంగళూరుకు వలస వెళ్లి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో మంగళవారం ఓ చెట్టును తొలగిస్తుండగా ప్రమాదవశాత్తూ చెట్టు పై నుంచి కింద పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. అతడికి భార్య పార్వతి, కుమారుడు పవన్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..

మృతి చెందిన వెంకటచరణ్‌రెడ్డి

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

మండలంలోని ముచ్చుకోట గ్రామ సమీపంలో బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు.. తండ్రీ కొడుకులు లక్ష్మిరెడి, వెంకటచరణ్‌రెడ్డి (25) నంద్యాల జిల్లా అవుకు మండలంలోని రామాపురంలో ట్రాక్టర్‌లో బండలు లోడ్ చేసుకుని ధర్మవరం తీసుకెళ్తుండగా ముచ్చుకోట కనుమలో మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వెంకటచరణ్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. లక్ష్మిరెడ్డి భార్య సుజాతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చెరువులో పడి రైతు..

ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్

ప్రమాదవశాత్తూ చెరువులో పడి ఓ వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండలంలోని వైటి చెరువు గ్రామంలో చోటుచేసుకుంది. బంధువులు తెలిపిన వివరాలు.. రైతు హుస్సేన్‌పీరా (70) ఏడు రోజుల క్రితం వారి పొలంలో పండిన కంది పంట దిగుబడిని గుంతకల్లు మార్కెట్‌కు తీసుకెళ్లాడు. ఆ రోజు నుంచి ఇంటికి రాకపోడంతో అన్నిచోట్లా గాలించారు. ఫలితం లేకపోవడంతో గుంతకల్లు రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఇంతలో వైటి చెరువులో గ్రామస్తులు ఓ మృతదేహాన్ని గుర్తించారు. ఈ విషయం తెలిసి పోలీసులు వారి కుటుంబ సభ్యులతో కలిసి అక్కడికి వెళ్లి పరిశీలించగా హుస్సేన్‌పీరాగా గుర్తించారు. మృతదేహాన్ని గుంతకల్లు ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు గుంతకల్లు రూరల్ పోలీసులు తెలిపారు.

మద్యం విక్రేత అరెస్టు

ప్రజాశక్తి-పుట్లూరు

అందిన సమాచారం మేరకు బుధవారం హెడ్ కానిస్టేబుల్ సాములు, కానిస్టేబుల్ శ్రీనివాసులు మండలంలోని మడ్డిపల్లి గ్రామం వెళ్లి మద్యం విక్రయిస్తున్న రామభూపాల్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి 12 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని అతడిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

CHANDE OF NAME

I, BACHKORE KHAJA SHAHIN TAJ (Old Name) D/o BACHKORE ASIF residing at # 9-281, Amudala Street, Pamidi, Pamidi (M), Anantapur (Dist.) Changing my name from BACHKORE KHAJA SHAHIN TAJ to BACHKOR KHAJA SHAHEEN TAJ (New Name). Hence for, I am being called as BACHKOR KHAJA SHAHEEN TAJ for all purposes.

CHANDE OF NAME

I, AMRIN (Old Name) W/o BACHKORE ASIF residing at # 9-281, Amudala Street, Pamidi, Pamidi (M), Anantapur (Dist.) Changing my name from AMRIN to BACHKORE AMRIN (New Name). Hence for, I am being called as BACHKORE AMRIN for all purposes.

CHANDE OF NAME

I, BHOOMIREDDY SYAMALA (Old Name) W/o BHOOMIREDDY LAKSHMI NARAYANA REDDY residing at # 4-42-69, Porata Colony, Tadipatri, Tadipatri (M), Anantapur (Dist.) Changing my name from BHOOMIREDDY SYAMALA to BHOOMIREDDY SHYAMALA (New Name). Hence for, I am being called as BHOOMIREDDY SHYAMALA for all purposes.

CHANDE OF NAME

I, ASIF (Old Name) S/o BACHKORE BASHEER residing at # 9-281, Amudala Street, Pamidi-515775, Pamidi (M), Anantapur (Dist.) Changing my name from ASIF to BACHKORE ASIF (New Name). Hence for, I am being called as BACHKORE ASIF for all purposes.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడము ఏమనగా అనంతపురం వాసి మరియు ప్రస్తుత నివాసి ప్లాట్ నం.408సి, సిల్వర్ పెరల్ అపార్ట్‌మెంట్, హోసూరు రోడ్, పరప్పన్ అగ్రహార, బెంగళూరు నివాసి అయిన నా క్లయింట్ టి.బాబ్‌జాన్ తండ్రి టి.అక్కులప్ప, రాచానపల్లి గ్రామ పొలంలో సర్వే నెం.170/1c లో 3.84 ACS హక్కు కలిగి ఉన్నాడు.అయితే సదరు షెడ్యూలు ఆస్తి జాయింటుగా నా క్లయింట్ కుటుంబ ఆధీనంలో ఉన్నది.తేది20/3/2020 లింకుపత్రం నందు నా క్లయింట్ తాత మరియు ఆయన తమ్ముడు వారసులైన చిన్న అక్కులప్ప, అక్కులప్ప, హుస్సేనప్ప, ఖాసీం, కలిసి జాయింట్ ఆధీనంలో ఉన్న ఆస్తిని ఏబిసిడి షెడ్యూల్డ్ కింద పంచుకోవడమైనది. ఇంకను ఎవరైన హక్కుదారులున్నచో ఈ ప్రకటన వెలువడిన ఏడు రోజుల్లోపు నా క్లయింట్ బాబ్‌జాన్ గారికి తెలుపవలెనని కోరుతున్నాను.సదరు గడువు లోపు ఎలాంటి అభ్యంతరాలు రానిచో నా క్లయింట్ అయిన బాబ్‌జాన్‌కు సర్వహక్కులు ఉండునని తెలియజేస్తున్నాను.

షెడ్యూలు

అనంతపురం సబ్‌డివిజన్‌కు చెందిన రాచానపల్లి గ్రామపంచాయతీలోని ఆస్తి వివరాలు
సర్వే నం.170/1, సబ్‌డివిజన్170/1సి, ఎసి 3.84, హెచ్‌ఎస్1.555 As for 1B అడంగల్ సర్వేనంబర్ 170/1సి రీసర్వే చేయగాతేలిన ఎకరాలు 4.02, హెచ్‌ఎస్ 1.628, ఎల్‌పి నం.998
చెక్కుబంది;
తూర్పు-తాడిపత్రి చిన్న అక్కులప్ప ల్యాండ్ అదర్స్
పడమర-తాడిపత్రి ఖాసీం ల్యాండ్
ఉత్తరం-తాడిపత్రి మస్తానప్ప ల్యాండ్
దక్షిణం-ల్యాండ్ ఆఫ్ బి.వెంకటరెడ్డి అండ్ కురుగుంట గ్రామపొలం

ఎన్.ఆర్.కె.మోహన్,
న్యాయవాది, అనంతపురం.సెల్: 9440787100

GOVERNMENT OF ANDHRA PRADESH
APEWIDC, KADAPA CIRCLE
"e-procurement tender notice"

Short Tenders are invited on eprocurement platform **05 to 13/SE/APEWIDC/KDP/2024-25, Dt.08.01.2025** in Kadapa, Sri Satya Sai, Chittoor and Tirupati District.
NIT No.05 to 13 downloading commencement on 09.01.2025 and closing date may be viewed in e-Procurement.gov.in.
For further details can be viewed at https://tender. apeprocurement.gov.in or contact Cell: 97047 01689.

S.Siva Kumar, AMIE.,
SUPERINTENDING ENGINEER, APEWIDC, KADAPA.

సమగ్ర అవగాహనతోనే 'కిశోరి వికాసం' సాధ్యం

ప్రజాశక్తి-అనంతపురం

సమగ్ర అవగాహనతోనే కిశోరి వికాసం సాధ్యమని ఐసిడిఎస్ సిడిపిఒలు తెలిపారు. అనంతపురం రూరల్ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని అనంతపురం రూరల్ మండలం అంగన్వాడీ, ఆరోగ్య, సచివాలయ సిబ్బందికి బుధవారం నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో కిశోరి వికాసంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించా అనంతపురం రూరల్, ఉరవకొండ, నార్పల సిడిపిఒలు ధనలక్ష్మి, శ్రీదేవి, భారతి హాజరై మాట్లాడారు. 'కిశోరి వికాసం' ఉద్దేశాన్ని గ్రామాల్లో అందరికీ తెలియ జేసి, ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. తద్వారా బాలికల విద్య, ఆరోగ్యం, భద్రత, ఆర్థిక స్వావలంబ నను మెరుగుపరచవచ్చాన్నారు. బాల్య వివాహాలను నియంత్రించాలన్నారు. బాలికలకు సరైన విజ్ఞానం అందించి వారు జీవితంలో అన్ని విధాలా ఎదిగేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు జయశ్రీ, నీలావతి, భారతి, ఝాన్సీ తో పాటు వెలుగు ఏపీఎం, అంగన్‌వాడీ వర్కర్లు, ఏఎన్ఎంలు, మహిళా పోలీసులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. తదితరులు పాల్గొన్నారు

నార్పల : 'కిశోరి వికాసం'లో భాగంగా స్థానిక కెజిబివిలో బాలికలకు మనోవికాసం, స్వీయ రక్షణ, నైపుణ్యం, శక్తిసామర్థ్యాలు పెంపొందించడంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 10-18 ఏళ్ల బాలికల్లో నిర్దేశిత అంశాలపై మానసిక ధైర్యం, దృఢ సంకల్పం పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య లక్ష్యమన్నారు. కార్యక్రమంలో సిడిపిఒ భారతి, ఎంఇఒ కృష్ణయ్య, సూపర్వైజర్ మధుమాలిని, హేమలత, నాగమణి, నిర్మల, హెల్ప్ లైన్ నిర్మల, సంధ్య, ఆర్‌డిటి సిబ్బంది ఆదినారాయణ, కళాజాత, కరాటే బృందాలు తదితరులు పాల్గొన్నారు.

కిశోరి వికాసం పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అధికారులు

బొమ్మనహాల్ : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో 'బాలికలను చదవనిద్దాం.. బతకనిద్దాం.. బాల్య వివాహాలను అరికడదాం'పై ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులను ఎంపిడిఒ దాస్‌నాయక్ ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లో బాల్య వివాహాలను పూర్తిస్థాయిలో అరికట్టడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, చట్టాలను అధికారులు వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐ నబిరసూల్, కణేకల్ ఇన్‌ఛార్జి సిడిపిఒ లక్ష్మీప్రసన్న, ఈవోపీఆర్డి దేవదాస్, ఐకెపి ఎపిఒ రామకృష్ణ, పిహెచ్‌సి డాక్టర్ మల్లేశ్వరి, డాక్టర్ రజియా సుల్తాన్, ఎంఇఒ ఈరన్న, అంగన్వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు

ఆలూరులో ఎమ్మెల్యే జయరామ్‌ను కలిసిన కట్టకిందపల్లి గ్రామస్తులు

బస్సు సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి-పామిడి

మండలంలోని కట్టకిందపల్లి గ్రామంలో ఈ నెల 20, 21 తేదీల్లో జరిగే పెద్దమ్మతల్లి ఊరుదేవర సందర్భంగా బస్సు, తాగునీటి సౌకర్యం కల్పించాలని, డ్రెయినేజీ కాలువల్లో పూడిక తీయించాలని, రోడ్లకు ఇరువైపులా కంపచెట్లు తొలగించాలని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్‌కు విన్నవించారు. వారు బుధవారం కర్నూలు జిల్లాలోని ఆలూరులో ఎమ్మెల్యే ఇంటికి వెళ్లి విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే జయరామ్ వెంటనే ఆర్టీసీ అధికారులకు ఫోన్ ద్వారా విషయం తెలిపి ఊరుదేవరకు 2 రోజులు ముందుగానే ప్రతి రోజూ బస్సు సౌకర్యం కల్పిస్తామన్నారు. నీటి కొరత లేకుండా 8 వాటర్ ట్యాంకులు ఏర్పాటు చేస్తామన్నారు. కంప చెట్ల తొలగింపు, ఇతరత్రా పనులను వెంటనే చేపట్టాలని స్థానిక టిడిపి నాయకులకు తెలిపారు. కార్యక్రమంలో సుంకిరెడ్డి, నాగిరెడ్డి, చుక్క బాబు, చుక్క శ్రీనివాసులు, పెద్దరెడ్డి, సంజీవ రాయుడు, ఫీల్డ్ అసిస్టెంట్ సుమన్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్

ఎక్సైజ్ స్టేషన్ తనిఖీ

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని ఎక్సైజ్ స్టేషన్‌ను బుధవారం జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డి సందర్శించి రికార్డులను పరిశీలించారు. కర్నాటక మద్యం అక్రమ రవాణా, బెల్టు షాపులు, ఎంఆర్‌పి ధరల విషయంలో కఠినంగా వ్యవహరించాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. అనంతరం మద్యం షాపుల లైసెన్స్‌దారులతో సమావేశం నిర్వహించి, ఎమ్మార్పీకే మద్యం విక్రయించాలని, బెల్ట్ షాపులకు మద్యం సరఫరా చేయరాదని సూచించారు. సమావేశంలో షాపు లైసెన్స్‌దారులు, టాస్క్ ఫోర్స్ సిఐ జయనాథ్‌రెడ్డి, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మహేష్ కుమార్ పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగం

ప్రజాశక్తి-పుట్లూరు

మండలంలోని చింతకుంట గ్రామంలో బుధవారం ఎడిఎ చెంగళరాయుడు ఆధ్వర్యంలో జొన్న పొలంలో పంట కోత ప్రయోగాలు చేపట్టారు. శనగలగూడూరు గ్రామంలో మినుము పంటలో పంటకోత ప్రయోగాలు చేపట్టారు. ఆయన వెంట ఏవో కాత్యాయిని, ఎఇఒ హరి, ఎంపిఇఒ సూర్యనారాయణరెడ్డి, విఆర్ఎ నల్లప్ప, రైతులు ఉన్నారు.

కళాశాలలో మధ్యాహ్న భోజనం తనిఖీ

ప్రజాశక్తి-ఉరవకొండ

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని బుధవారం ఎస్ఎఫ్ఐ నాయకులు పరిశీలించారు. ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు నందు, హారున్ రషీద్ మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ సుదీర్ఘ పోరాటాల ఫలితంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేశారన్నారు. ఈ పోరాట క్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులపై కేసులు నమోదైనా విద్యార్థుల కోసం మధ్యాహ్న భోజన పథకం అమలయ్యే వరకూ పోరాటాలు చేసిందన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు.

నార్పల : బొందలవాడ గ్రామ బిసి, ఎస్సీ కాలనీ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని వైస్ సర్పంచి ఆలం వెంకట నరసానాయుడు తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. పాఠశాలలోని వాటర్ ట్యాంక్, పలు సమస్యలను గుర్తించి సంబంధిత అధికారులకు తెలిపారు.

మధ్యహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఎఐవైఎఫ్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని చిందనూరు కళ్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా కొట్రేష్, ప్రధాన కార్యదర్శిగా సంతోష్‌కుమార్, ఉపాధ్యక్షులుగా శామ్యూల్, దేవేంద్ర, కుళ్లాయిస్వామి, సహాయ కార్యదర్శులుగా మోహన్‌కృష్ణ, వంశీ, ధనుంజయ, కోశాధికారిగా శ్రీనివాస్, 23 మంది కార్యవర్గ సభ్యులు, 53 మంది జిల్లా కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు. జిల్లా నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ఫిబ్రవరి 6, 7 తేదీల్లో శ్రీకాకుళం జిల్లాలో జరిగే ఎఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు.

సంతోష్‌కుమార్

కొట్రేష్

యువత మాదకద్రవ్యాల జోలికెళ్లొద్దు

ప్రజాశక్తి-గుత్తి

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, దాని మత్తులో పడితే భవిష్యత్తు నాశనం అవుతుందని పెద్దవడుగూరు సిఐ రామసుబ్బయ్య హెచ్చరించారు. పట్టణ శివారులోని గేట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సిఐ మాట్లాడుతూ ర్యాగింగ్ చట్టరీత్యా నేరం అన్నారు. ర్యాగింగ్ చేస్తే జైలు పాలవుతారన్నారు. మాదకద్రవ్యాలు ఉపయోగించినా, విక్రయించినా కఠిన శిక్షలు తప్పవన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ వికె.పద్మావతమ్మ, ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్, డాక్టర్ హరిప్రియ, ప్రొఫెసర్ నరసింహులు, యాంటీ ర్యాగింగ్ విభాగాధిపతి అనంతగుప్తా, అధ్యాపకులు పాల్గొన్నారు.

సదస్సులో పాల్గొన్న సిఐ రామసుబ్బయ్య, అధికారులు

సొంత ఖర్చులతో పైపులైన్ మరమ్మతులు

ప్రజాశక్తి-యాడికి

యాడికిలో కొండ కింద తాగునీటి పైపులైన్ మరమ్మతులకు గురవడంతో నీటిఎద్దడి నెలకొంది. ఈ విషయాన్ని కాలనీవాసులు టిడిపి నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన టిడిపి మండల కన్వీనర్ రుద్రమనాయుడు ఆదేశాల మేరకు బుధవారం టిడిపి బిసి సంఘం ఉపాధ్యక్షుడు వెంకటేష్, తెలుగు యువత అధ్యక్షుడు పామిశెట్టి గోపి, ఐటిడిపి అధ్యక్షులు దామినేని నరసింహచౌదరి సొంత ఖర్చులతో పైపులైన్ మరమ్మతులు చేయించారు. దీంతో తాగునీటి సమస్య పరిష్కారమైంది.

జిల్లా రైతాంగాన్ని ఆదుకోండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

కరువుతో నష్టపోయిన జిల్లా రైతాంగాన్ని ఆదుకోవాలని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ కేంద్ర కరువు అధ్యయన బృందానికి విన్నవించారు. ఆయన బుధవారం టిడిపి జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్‌తో కలిసి రాప్తాడులో కేంద్ర కరువు బృందాన్ని కలిశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కరువుతో పరిస్థితులతో జిల్లా రైతులు సర్వం నష్టపోయారని, రైతులకు కనీసం పశుగ్రాసం కూడా దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కరువు బృందానికి రైతుల కష్ట నష్టాలను వివరించి వినతి పత్రం అందజేశారు.

అదానీ సిమెంట్స్‌లో ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

మండలంలోని తలారిచెరువు వద్ద ఉన్న అదానీ సిమెంట్ ఫ్యాక్టరీలో బుధవారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పరిశ్రమ చీఫ్ మేనేజర్ పివి.కృష్ణయ్య ఆధ్వర్యంలో లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు శ్రీదేవి ముగ్గుల పోటీలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ తెలుగువారి సంప్రదాయ చిహ్నమైన రంగవల్లులు, సంక్రాంతి పండుగ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో పరిశ్రమలో ఉన్న కాలనీవాసులు, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలు

రైతులు రీ సర్వేకు సహకరించాలి

ప్రజాశక్తి-బెళుగుప్ప

మండలంలో రెవెన్యూ అధికారులు చేపడుతున్న రీసర్వేకు రైతులందరూ సహకరించాలని తహశీల్దార్ సి.షర్మిల తెలిపారు. మండలంలోని తగ్గుపర్తి గ్రామంలో బుధవారం అధికారులు ప్రజలకు రీ సర్వేపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. తహశీల్దార్ మాట్లాడుతూ రైతుల భూ సమస్యల పరిష్కారం కోసమే రీ సర్వే చేస్తున్నట్లు తెలిపారు. రీ సర్వేలో భాగంగా అధికారులు నాలుగు బృందా లుగా ఏర్పడి రోజుకు 20 నుంచి 25 ఎకరాలు సర్వే చేస్తున్నట్లు తెలిపారు. రీ సర్వే తర్వాత చేర్పులు, మార్పులు ఉంటే వాటిని చేయడానికి కొంత సమయం పడుతుందన్నారు. కావున రైతులందరూ సహకరించి రైతులు వారి హద్దులు, భూమి విలువ, వివరాలు సర్వేయర్ల సిబ్బందితో కలిసి రీసర్వే చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ టి.లక్ష్మీనారాయణ, రెవెన్యూ అధికారులు, గ్రామ సర్పంచి, నాయకులు పాల్గొన్నారు.

రీ సర్వేపై అవగాహన ర్యాలీ చేపట్టిన తహశీల్దార్ షర్మిల

సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

ఎంపిడిఒ లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి-బెళుగుప్ప

సచివాలయ ఉద్యోగులు విధులకు తప్పకుండా హాజరై ప్రజల సమస్యలు పరిష్కరించాలని ఎంపిడిఒ లక్ష్మీనారాయణ ఆదేశించారు. మండలంలోని తగ్గుపర్తి, కాలువపల్లి గ్రామ సచివాలయాలను బుధవారం ఎంపిడిఒ సందర్శించి హాజరు పట్టిక, రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు సచివాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజలను సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ఎవరైనా విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు